క్లుప్తంగా

గుడిసెలకు నిప్పుపై ఫిర్యాదు

సత్యవేడు: మండలంలోని పేరడం గ్రామానికి చెందిన గిరిజనుల పూరి గుడిసెలకు నిప్పు పెట్టిన వారిపై బుధవారం సీపీఎం నేతలతో కలిసి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్దన్, మండల కార్యదర్శి మెలుగు రమేష్ మాట్లాడుతూ మేకల రామయ్య, మేకల రాణి గుడిసెలకు మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారన్నారు. బాధితులకు ప్రభుత్వం ఆర్థికసాయం, బియ్యం అందించాలని కోరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు


బాలాజీ, ఎంపీడీఓ

నాగలాపురం: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బాలాజీ నాయక్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 21 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీలు మే 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

పాఠశాలలో రికార్డుల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పూసలపల్లె ప్రాథమిక పాఠశాలను ఎంఈవోలు రవీంద్రనాథ్,ముని సుబ్రమణ్యం బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని ఆదేశించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించారు.

పశు వైద్యాధికారిగా అశ్వని



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు పశువుల ఆస్పత్రి వైద్యాధికారిగా అశ్వని నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు ఆమె బాధ్యతలు చేపట్టినట్లు ఈఓ మునిరాజా తెలిపారు.

శ్మశానవాటికలో వసతులకు ప్రాధాన్యం


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బుధవారం నారాయణవనం హిందూ శ్మశాన వాటికలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రహరీ గోడ, దహన వాటికను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశాన వాటికల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ఎప్పటికప్పుడు బిల్లులను మంజూరు చేయిస్తామని వెల్లడించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, ఎంపీడీఓ గుణశేఖర్, ఈఓపీఆర్‌డీ డాక్టర్ వేణయ్య, సర్పంచ్ శారదాగణేషన్, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ సీఐకి సత్కారం


సీఐని సన్మానిస్తున్న సర్పంచ్ నగేశం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లును సర్పంచ్ నగేశం, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

టీటీడీ ఈఓతో ఎమ్మెల్యే భేటీ

వరదయ్యపాళెం: సత్యవేడులో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. బుధవారం ఈ మేరకు తిరుపతిలోని టీటీడీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లో ఈఓ శ్యామలరావుకు విన్నవించారు. దీనిపై ఈఓ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అమ్మ సంబరం



శ్రీకాళహస్తిలోని ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఎదుట పోతురాజు ముగ్గు వేసి శాంతి పూజలు జరిపించారు. అనంతరం గ్రామోత్సవం చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి 7గంటలకు రేణుకాదేవి ముగ్గు, కుంభం వేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓ బాపిరెడ్డి సారెను సమర్పించారు. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు కంఠా ఉదయ్, స్వర్ణమూర్తి, సురేష్, మున్నా రాయల్, మురళీయాదవ్, గణేష్, కిరణ్, అట్ల రమేష్, రవి, కామి వెంకటేశ్వర్లు, జీవీకే రెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు. –శ్రీకాళహస్తి



పోతురాజు ముగ్గు, (ఇన్‌సెట్) అమ్మవారి సేవలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

గణపతి వైభవం

రేణిగుంట పంచాయతీ వడ్డిమిట్టలో నూతనంగా నిర్మించిన శ్రీవరసిద్ధి విజయ గణపతి ఆలయంలో బుధవారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అర్చకుడు ఆచార్య గణేష్ స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా గోపూజ, గణపతి హోమం జరిపించారు. అనంతరం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో కలశ పూజ చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి కనులపండువగా గ్రామోత్సవం చేశారు.
–రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)





ఆరుగాల కష్టం.. అంతా నష్టం!

ఆరుగాల కష్టం.. చివరకు నష్టాలనే మిగులుస్తోంది. ఆశించిన దిగుబడి రాక వేరుశనగ సాగు చేసిన రైతాంగం దిగాలు పడింది. పంట చేతికొచ్చిన దశలో ధరలు పతనం కావడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వ నుంచి ఎలాంటి భరోసా లేకపోవడంతో ఆవేదన చెందుతోంది. పెట్టుబడి సంగతి దేముడెరుగు.. కనీసం చేసిన అప్పుకు వడ్డీ కూడా వచ్చే పరిస్థితి లేక కుదేలవుతోంది.

- అంతంత మాత్రంగా వేరుశనగ దిగుబడి
- పంట చేతికొచ్చే నరికి పతనమైన ధరలు
- గిట్టుబాటు దక్కక ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వం చేయూత లేక దిగాలు


వరదయ్యపాళెం మండలం వెంగారెడ్డికండ్రిగ వద్ద కల్లాంలో ఆరబోసిన వేరుశనగ

సత్యవేడు డివిజన్‌లో వేరుశనగ సాగు వివరాలు

మండలం	హెక్టార్లలో
సత్యవేడు	510
వరదయ్యపాళెం	170
నాగలాపురం	360
పిచ్చాటూరు	820

వరదయ్యపాళెం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ పంటను విస్తారంగా సాగు చేశారు. సత్యవేడు వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని 4 మండలాల్లో ఈ సీజన్‌కు సాధారణంగా 1,905 హెక్టార్లు సాగు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 1,860 హెక్టార్‌లలో వేరుశనగ సాగు చేశారు. గత ఏడాది కురిసిన వర్షాల కారణంగా బోరు బావుల్లో నీరు పుష్కలంగా చేరింది. చెరువులు సైతం నిండాయి. నీటి ఆదరవు ఉండడంతో సాధారణ సాగు లక్ష్యానికి చేరువగా రైతులు పంట సాగు చేసుకున్నారు.

నిరాశాజనకంగా ధర

వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర మాత్రం రైతులకు అందనంత దూరంలో ఉంది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం బస్తా వేరుశనగకు రూ. 500 నుంచి రూ. 600 వరకు రేటు తగ్గింది. గత ఏడాది బస్తా వేరుశనగకాయలు రూ. 3వేల నుంచి రూ.3,200 వరకు పలికింది. ఈ ఏడాది అదే బస్తా రూ.2,500 నుంచి రూ.2,600 మాత్రమే ఉంది. అదే వేరుశనగ విత్తన కాయల బస్తాను రూ.4వేల వరకు వెచ్చించి కొనుగోలు చేసినట్లు రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో పంట చేతికొచ్చే సమయానికి ధరలు పతనమైనట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గిస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన దిగుబడి

ఈ ఏడాది గిట్టుబాటు ధరతో పాటు పంట దిగుబడి కూడా తగ్గిపోయినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది ఎకరా వేరుశనగ పంటకు 40 నుంచి 50 బస్తాలకు పైగా దిగుబడి వచ్చిందని, అయితే ఈ ఏడాది 30 నుంచి 40 బస్తాలు రావడమే కష్టంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఓవైపు పంట సాగుకు పెట్టుబడి సైతం ఏటా రెట్టింపు అవుతున్న నేపథ్యంలో అటు దిగుబడి, ఇటు గిట్టుబాటు తగ్గిపోతుండడం కోలుకోలేని దెబ్బ అని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరా వేరుశనగ పంట సాగు చేయాలంటే రూ.50వేలకు పైగా పెట్టుబడి అవుతోందని, అందుకు తగ్గట్టు దిగుబడి వస్తేగానీ గిట్టుబాటు కాదని వెల్లడిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాబోయే రోజులు వ్యవసాయానికి గడ్డుకాలమేనని రైతులు స్పష్టం చేస్తున్నారు.


వరదయ్యపాళెం మండలం తొండంబట్టు వద్ద వేరుశనగ పంట నూర్పిడి చేస్తున్న యంత్రం

కష్టతరంగా మారింది



ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం కష్టతరంగా మారింది. రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. ఈ ఏడాది ఒక్కో వేరుశనగ బస్తాపై రూ. 600 దాకా ధర తగ్గిపోయింది. దీంతో వచ్చిన అరకొర దిగుబడితో పెట్టుబడులు కూడా రావడం లేదు. 10 ఎకరాల్లో ఈ ఏడాది వేరుశనగ సాగు చేశా. రూ.6లక్షలకు పైగా పెట్టుబడి పెట్టా. చేతికి ఎంత వస్తుందో అర్థం కావడం లేదు.
–రవి, రైతు, వెంగారెడ్డికండ్రిగ, వరదయ్యపాళెం మండలం

ప్రభుత్వ స్పందన లేదు



ప్రస్తుత ప్రభుత్వంలో రైతుకు ఎలాంటి సహకారం లేదు. వ్యయప్రయాసలకు ఓర్చి పంట సాగు చేసినప్పటికీ గిట్టుబాటు ధర లభించడం లేదు. ప్రైవేటు వ్యాపారులు కుమ్మక్కై గిట్టుబాటు ధర దక్కకుండా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదు.
–రమేష్ రెడ్డి, రైతు, నాగనందాపురం, వరదయ్యపాళెం మండలం

భూముల రీసర్వేపై ర్యాలీ



ర్యాలీలో నిర్వహిస్తున్న తహసీల్దారు శ్రీదేవి, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చిన్నయగుంటలో త్వరలో చేపట్టనున్న భూముల రీ సర్వేపై బుధవారం తహసీల్దారు శ్రీదేవి, సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ చిన్నయగుంటలో 686.28 ఎకరాల భూమి ఉందని, ఇందులో 93 ఖాతాలకు గాను ప్రభుత్వ భూమి 214.53 ఎకరాలు, పట్టా భూమి 471.75 ఎకరాలు ఉన్నట్లు వివరించారు. క్షేత్ర స్థాయిలో భూములను సర్వే సిబ్బంది పరిశీలించి, సమస్యలను పరిష్కరిస్తారని వెల్లడించారు. భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య, సర్వేయర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.60వేలు


విరాళం అందిస్తున్న శ్రీధర్ గుప్తా

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం, గోశాల నిర్వహణకు పట్టణానికి చెందిన మునగాల శ్రీధర్‌గుప్తా బుధవారం రూ.60వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు స్వామి అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు.

రుణాల దుర్వినియోగంపై ఫిర్యాదు


ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పూసలపల్లెల వెలుగులో ఓటీఎస్ కింద తీసుకున్న రుణాలు దుర్వినియోగమైనట్లు స్థానిక మహిళలు ఆరోపించారు. బుధవారం ఈ మేరకు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ 2022లో ఓటీఎస్ కోసం చెంగాళమ్మ, సాయిబాబా, భాగ్యలక్ష్మి గ్రూపులకు సంబంధించిన 9 మంది కలిసి రుణాలు తీసుకున్నామన్నారు. గతంలో పనిచేస్తున్న సీసీ, సంఘమిత్ర ఒక్కో గ్రూపులోని ఆరుగురు సభ్యుల పేరుమీదు అదనపు రుణం తీసుకున్నారని ఆరోపించారు. తాము తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేశామని, అయితే సీసీ, సంఘమిత్ర కట్టకపోవడంతో మూడు గ్రూపులకు సంబంధించి రూ.1.28లక్షల రుణం కట్టాలని బ్యాంకు అధికారులు వెల్లడించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఎంపీడీఓను కోరారు. దీనిపై ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ సీసీ, సంఘమిత్రలను పిలిపించి, విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రసాభాసగా గ్రామ సభ


పంచాయతీ ఈఓను నిలదీస్తున్న నేతలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు. సభ ఆరంభంలో సర్పంచ్ నగేశం అధ్యక్షతన ఈఓ మణి గత ఆర్థిక సంవత్సరం జమా ఖర్చులను వెల్లడించారు. ఈ క్రమంలో అధ్వానంగా మారిన పారిశుధ్యం, చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో పక్షపాత వైఖరి, అధిక మొత్తం గేటు వసూళ్లపై పలువురు నేతలు, స్థానికులు నిలదీశారు. ఉపాధి పనులు చేసినప్పటికీ కూలి నగదు చెల్లించకపోవడంపై కూలీలు ప్రశ్నించారు. వారాల తరబడి కూలి డబ్బులు ఇవ్వకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని మండిపడ్డారు. స్థానిక వినాయకనగర్‌లో దోమలు విపరీతంగా వ్యాప్తిం చెందాయని, ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి లీకేజీలు ఉన్నాయని స్థానికులు ఆరోపించారు. దీనిపై పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సభ్యులు రాజేశ్వరి మాట్లాడుతూ పంచాయతీలో మూడు నెలలుగా వీధి దీపాలు వెలగకపోయినా స్పందించే వారే కరువయ్యారన్నారు. అలాగే వారపు సంత అభివృద్ధి పేరిట రోజువారీ మార్కెట్‌ను శిథిలావస్థకు చేర్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు పిలవకుండా ఇష్టారాజ్యంగా పనులు అప్పగించడంపై జనసేన, సీపీఎం, కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ఈ క్రమంలో ముప్పేట దాడిని ఎదుర్కోలేక పంచాయతీ అధికారులు చల్లగా సమావేశం నుంచి జారుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాళహస్తి: పట్టణంలోని బజారువీధికి చెందిన నగలవ్యాపారి జూలుగంటి గోపి తల్లి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బుధవారం వారి నివాసానికి వెళ్లి గోపీని పరామర్శించారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు కంఠా ఉదయ్, స్వర్ణమూర్తి, సురేష్, మున్నా రాయల్, మురళీయాదవ్, గణేష్, కిరణ్, అట్ల రమేష్, రవి, కామి వెంకటేశ్వర్లు, జీవీకే రెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.



గోపీని పరామర్శిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

వసతుల కల్పనకు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న గురవయ్య

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన బంకులకు కనీస వసతులు కల్పించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య కోరారు. బుధవారం ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ గిరికుమార్‌కు బంకుల యజమానులతో కలిసి వినతిపత్రం అందించారు. గురవయ్య మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ సమీపంలోని బంకులను తొలగించి శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ ఎదురుగా ఏర్పాటు చేయించారన్నారు. ఇప్పటికి మూడు నెలలు గడుస్తున్నా కరెంట్ కనెక్షన్, నీటి వసతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజులలో సమస్య పరిష్కరించకుంటే మళ్లీ బంకులను మార్కెట్ దగ్గరకే చేరుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు గోపి, చారులత, జనార్దన్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


నివారణ చర్యలను వివరిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: అగ్నిప్రమాదాల నివారణపై శ్రీకాళహస్తి అగ్నిమాపకశాఖ ఇన్‌చార్జి అధికారి నాగార్జునరెడ్డి అవగాహన కల్పించారు. బుధవారం పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీలో ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుమలరెడ్డి, ధనశేఖర్, మునిశేఖర్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.
సత్యవేడు: దళవాయి అగ్రహారంలో మహిళలకు గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వస్తే ఆర్పే విధానంపై అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఓ రాజయ్య, ఎల్ఎఫ్ ప్రసాద్, శ్రీనివాసులు, గోవిందరాజులు పాల్గొన్నారు.

పిట్ట వాలదు.. పొట్ట నింపదు!

అమెరికన్ సూర్యకాంతి మొక్క అని పిలవబడే కోనోకార్పస్ మొక్క.. తోటకు అలకారంగా వినియోగిస్తుంటారు. అయితే అందంగా కనపడే ఈ వృక్ష జాతి విపరీతమైంది. ఈ చెట్లపై పక్షులు సైతం వాలవు. వీటి ఆకులను పశువులు కూడా తినవు. ఈ మొక్కల పుప్పొడి కారణంగా శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. చర్మం.. ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. ఇవేమీ పట్టించుకోని పలువురు అధికారులు పలు ప్రాంతాల్లో కోనోకార్పస్ మొక్కలను ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు. ప్రధానంగా రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయ మార్గంలో ఇరువైపులా ఈ ప్రమాదకర చెట్ల పొదలే దర్శనమిస్తున్నాయి. అలాగే రేణిగుంట పంచాయతీ పార్క్‌లో సైతం ఎటుచూసినా కనిపిస్తున్నాయి. ఈ మొక్కలను పలు దేశాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నిషేధించాయి. వీటిని పెంచితే జరిమానాతోపాటు జైలుశిక్ష సైతం విధిస్తున్నాయి. ఈ క్రమంలో వెంటనే రేణిగుంట పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా పెంచుతున్న కోనోకార్పస్ మొక్కలను తొలగించి.. వాటి స్థానంలో దేశీయ వృక్షజాతులను నాటాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.
–రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్)


రేణిగుంట విమానాశ్రయ రహదారిలో కోనోకార్పస్ చెట్లు


ఎయిర్‌పోర్టు సమీపంలో..


రేణిగుంటలో పార్కు ముందు..